ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.2 కనిష్ఠం 21.3



ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

మోపాల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో శనివారం మోపాల్ మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమం మండలంలోని నర్సింగ్‌పల్లి నుంచి ప్రారంభమైందని వారు తెలిపారు. అర్హులను మాత్రమే ముందుగా గుర్తిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గల్ఫ్‌లో విగతజీవులుగా జిల్లావాసులు

- జిల్లావ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 31మంది మృతి
- అనధికారికంగా 50కి పైమాటే
- మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న బంధువులు
- దుబాయి మినహా మిగతాదేశాల నుంచి వచ్చే మృతదేహాల కోసం రోజుల తరబడి వేచిచూడాల్సిందే..

సుభాష్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వారంతా పొట్టచేతబట్టుకుని విదేశాల బాట పట్టారు.. రెండు మూడేళ్లపాటు ఎడారి దేశంలో పడరానిపాట్లు పడుతున్నారు.. కుటుంబానికి దూరంగా కాయకష్టం చేసి పోగుచేసిన డబ్బంతా ఇంటికి పంపుతున్నారు. ఇక కొన్నినెలల్లో ఇంటికి వస్తారనుకుంటుండగా ఆకస్మాత్తుగా శవాలవుతున్నారు. వాళ్లరాక కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఆవేదనే మిగిలిస్తున్నారు. వారిని కళ్లారా చూసుకోవాలని తపిస్తున్నవారి కుటుంబ సభ్యులకు మృతదేహమైనా సరైన సమయానికి రాకపోవడంతో కడచూపుకోసం మృతదేహాల కోసం ఎదురుచూస్తూ ప్రతీరోజు కన్నీరు కారుస్తున్నారు. ఎవరైనా తమకు సంబంధించిన మృతదేహాలను ఇంటికి తెప్పించాలని మొరపెట్టుకుంటున్నారు. కొందరిదైతే 15 రోజుల నుంచి నెలల తరబడి మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న దయనీయ పరిస్థితి. పలుకుబడి ఉన్నవాళ్లు ఎమ్మెల్యేలు, ఎంపీల చుట్టూ తిరిగి తమకు సంబంధించిన వారి మృతదేహాలను స్వదేశానికి రప్పిం చుకుంటున్నారు. ఎలాంటి పలుకుబడి లేని పేద కుటుంబాలు మృతదేహాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో ముఖ్యంగా ఆర్మూర్, నిజామాబాద్, డివిజన్ల పరిధిలో గల్ఫ్‌కు వెళ్లి కుటుంబాలను పోషించేవారు ఎక్కువగా ఉంటారు. ఆర్మూర్ నుంచి వేలల్లో గల్ఫ్‌లో ఉపాధి కోసం వెళ్లి జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా గల్ఫ్‌లో వివిధ కారణాలతో మృతిచెంది కుటుంబాలకు ఆవేదన మిగిలిస్తున్నారు. ఈమధ్యన గుండెపోటుతో సుమారు పదులసంఖ్యలో గల్ఫ్‌లో మరణించారు. వీరి మృతదేహాల కోసం పదుల రోజుల సంఖ్యలో కుటుంబాలు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు సహకరించినా అక్కడి చట్టాలు కఠినంగా ఉండడంతో మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికీ కొన్ని మృతదేహాలు స్వదేశానికి రాకపోవడంతో కుటుంబాలు కడచూపుకోసం రోదిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా మృతదేహాలను స్వదేశానికి తీసుకువచ్చేలా కృషిచేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా చనిపోయిన వారికి 5లక్షలు ఇవ్వడం పట్ల సంతోషంగా ఉన్నా మృతదేహాలు ఆలస్యంగా స్వగ్రామానికి రావడం పట్ల వారి కుటుంబ సభ్యుల రోదనలతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుంది. ఇతర దేశాల్లో మరణించిన వారి మృతదేహాలను వెంటవెంటనే స్వదేశానికి రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని గల్ఫ్ బాధితులు కోరుతున్నారు.



జమాల్ (ఫైల్)



గల్ఫ్‌లో మృతిచెందిన జమాల్ (ఫైల్)



బాల్‌రాజ్ (ఫైల్)

జిల్లాలో అధికారికంగా 31 మంది గల్ఫ్ మృతులు.. అనధికారికంగా 50-100 మందికిపైగా..

గల్ఫ్‌లో డబ్బులు సంపాదించి కుటుంబాన్ని సంతోషంగా ఉంచాలని ఎన్నో ఆశలతో గల్ఫ్‌వెళ్తున్న జిల్లావాసులు మృతదేహాలై తిరిగి వస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో అధికారికంగా 31మంది గల్ఫ్‌లో చనిపోయారు. ఇవి జిల్లాలో అధికారిక లెక్కలు మాత్రమే. వీరి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఐ పాలసీకి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు. వీటిసంఖ్యలో 31ఉంటే దరఖాస్తు చేసుకోకుండా ఎంతో మంది ఉన్నారు. ఇదిలాఉండగా మృతదేహాలు స్వదేశానికి రాకుండా చాలానే ఉన్నాయి. వీటన్నింటితో కలుపుకుని సంఖ్య 50 నుంచి 100కు (మిగతా 6వ పేజీలో..)



మా నాన్న మృతదేహాన్ని తొందరగా తెప్పించాలి

- జాఫర్, జమాల్ కొడుకు, నర్సింగ్‌పల్లి

మా నాన్న జమాల్ సౌదీ ఆరేబియాలో గుండెపోటుతో మరణించాడు. ఇప్పటికీ 15 రోజులు అవుతున్నా మృతదేహం ఇంటికి చేరలేదు. అక్కడ మా బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు కృషిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. మృతదేహాలను వెంటనే తెప్పించేలా ప్రభుత్వాలు కృషిచేయాలి. రోజుల తరబడి మృతదేహాల కోసం ఎదురుచూసి కుటుంబ సభ్యులు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రభుత్వాలు వీటిపై దృష్టిపెట్టాలి.



మృతదేహాలను తొందరగా రప్పించేలా చర్యలు చేపట్టాలి

- రజినీకాంత్, సిర్పూర్

గల్ఫ్‌లో మరణించిన వారి మృతదేహాలను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలి. నెలల తరబడి కుటుంబాలు మృతదేహాల కోసం ఎదురుచూపులు చూస్తున్నాయి. మరణించిన వారి కుటుంబసభ్యులు ఇంటి నుంచి బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా గల్ఫ్ బాధితులకు ఎక్స్‌గ్రేషియాను ఎలాంటి తాత్సారం లేకుండా ఇవ్వాలి. కుటుంబ సభ్యులను ప్రభుత్వాలు ఆదుకోవాలి.





సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రిజర్వాయర్ మరమ్మతు పనులను పరిశీలించారు. బాన్సువాడ, గాంధారి రైతుల ఆయకట్టు సాగు కోసం రెండు పంటలకు సరిపడా సాగునీటి కోసం ఈ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతాలోపం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కట్ట నిర్మాణం, సీసీ నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, రైతులు ఉన్నారు.

బీజేపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు

- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి
- బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యం : మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారని, ఇంత అభివృద్ధి చేస్తున్నా కళ్లు కనిపించని బీజేపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి అన్నారు. శనివారం జిల్లాకాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై లోపాయికారి ఒప్పందాలతో బీజేపీ ఎంపీలను గెలిపించాలని ముందుకువెళ్లారని రాష్ట్రంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నా ప్రత్యేకనిధులు తీసుకురావడం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో కుదుర్చుకున్న విభజన ఒప్పందం ద్వారా రావాల్సిన నిధుల గురించి మోదీతో బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లాకు అమృత్ స్కీమ్ ద్వారా రూ.215కోట్లతో ప్రతీ ఇంటికి మంచినీరు అందించే కార్యక్రమంతోపాటు 168 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. పసుపు బోర్డు ఇస్తామన్న హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రెండు పత్తి పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయడం కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసిన స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 14.5 శాతం ఉన్న జీడీపీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో 6.5కు పడిపోయిందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఆదరించి సలహాలు, సూచనలు చేయాలి కానీ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు.

రాకేష్‌రెడ్డికి మీడియాలో కనపబడాలనే ఆత్రుత..

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి మీడియాలో కనబడాలనే ఆత్రుత తప్ప ఏంమాట్లాడాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నాడని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గత పదేళ్లుగా కేవలం మతం పేరుతో ముందుకు వెళ్తుందే తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి బీజేపీ నాయకులు మాట్లాడటం లేదన్నారు. జిల్లాకు వచ్చిన మంత్రులకు వంగివంగి దండాలు పెట్టే రాకేష్‌రెడ్డి మీడియా ముందు మాత్రం మంత్రి ఛాంబర్‌ను ముట్టడిస్తానని వ్యాఖ్యలు చేస్తారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డిపై రాకేష్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావని, కోమటిరెడ్డి ఉద్యమనాయకుడని, రాకేష్‌రెడ్డి లాగా స్మగ్లర్ కాదన్నారు. ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల రావడంలో రాకేష్‌రెడ్డి చేసిందేమి లేదన్నారు. నుడా ఛైర్మన్ కేశవేణు మాట్లాడుతూ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ రాష్ట్రప్రభుత్వంపై విమర్శలు చేసేముందు నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, రత్నాకర్, జావిద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దిల్‌రాజు

ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా దిల్‌రాజు

- శుభాకాంక్షలు తెలిపిన జిల్లాకు చెందిన పలువురు

నిజామాబాద్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా జిల్లాకు చెందిన దిల్‌రాజు (వెంకటరమణారెడ్డి) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లాలోని మోపాల్ మండలం నర్సింగ్‌పల్లికి చెందిన దిల్‌రాజు 30ఏళ్లుగా సినీరంగంలో ఉన్నారు. నిర్మాతగా, పంపిణీదారునిగా కొనసాగుతున్నారు. జిల్లానుంచి సినీ రంగంలో నిర్మాతగా ఎదగడంతోపాటు పలు విజయవంతమైన సినిమాలను నిర్మించారు. ప్రభుత్వం ఆయనను ఛైర్మన్‌గా నియమించడంతో మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తనను ఛైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపా రు. త్వరలోనే ఆయన బాధ్యతలను చేపట్టనున్నారు. జిల్లాలో ఇప్పటికే ఐదుగురు నేతలకు కార్పొరే షన్ ఛైర్మన్ పదవులు రాగా ప్రస్తుతం దిల్‌రాజుకు కూడా ఛైర్మన్ పదవి వచ్చింది. జిల్లాలో కార్పొ రేషన్ ఛైర్మన్‌ల సంఖ్య పెరిగింది. సినీరంగంలో కొనసాగుతుండటం వల్ల జిల్లాకుచెందిన పలువు రు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గత ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం సాగింది. ఆయనతోపాటు ఆయన సోదరుడు కూడా ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం సాగింది. చివరకు ఆయనను ప్రభుత్వం తరపున ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియామకం చేశారు.

నిర్మించారు.. వదిలేశారు!

- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానాలు
- కరెంట్ కనెక్షన్, తాగునీటి వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు


5



నుడా డైరెక్టర్ పదవులపై కాంగ్రెస్ నేతల గురి!







- నుడా పరిధిలోకి అన్ని మండలాలు చేర్చడంతో డైరెక్టర్ల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యేలకు నేతల విజ్ఞప్తులు
- మండలానికి ఒకరికి అవకాశం ఇవ్వాలని ఒత్తిడి

నిజామాబాద్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్వైజరీ డైరెక్టర్ పోస్టులపై కాంగ్రెస్ నేతలు గురిపెట్టారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో నుడాను విస్తరించడంతో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జిలతోపాటు ఇతర నేతల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నుడాను విస్తరించిన విధంగానే డైరెక్టర్ల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు. మండలానికి ఒక డైరెక్టర్ ఉండే విధంగా చర్యలు చేపట్టి ఆ నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నేతలు ఈ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో అన్నినామినేటెడ్ పదవులు పూర్తి కావడంతో కొంతమంది నేతలు ఈ డైరెక్టరీ పదవులపై దృష్టిపెట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నుడా విస్తరించిన విధంగానే డైరెక్టరీ పదవులను కూడా పెంచేందుకు ఎమ్మెల్యేలతోపాటు ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

నుడా పరిధిలో 383 గ్రామాలు

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటైంది. ఆ సమయంలో పరిధిలో 13 మండలాలను తీసుకొచ్చి మొత్తం 83 గ్రామాలను నుడా పరిధిలో చేర్చారు. డైరెక్టర్లుగా 13మందికి అవకాశం కల్పించారు. నిజామాబాద్ జిల్లాలో నుడా పరిధిని కూడా అన్నిమండలాల పరిధిలోకి తీసుకువచ్చింది. జిల్లాలోని 33 మండలాల పరిధిలోని 383 గ్రామాలను ఈ నుడా పరిధిలోకి చేర్చింది. నుడా పరిధిలో ఈ గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులతోపాటు నిర్మాణాలు, మౌలిక వసతులను కల్పించనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలను చేపట్టనున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ఈ పరిధిని పెంచింది. నుడాను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో నామమాత్రం పనులే కొనసాగాయి. కార్యాలయం మున్సిపాలిటీకి మార్చిన ఇప్పటికీ కీలక పోస్టులను భర్తీ చేయలేదు. ప్రభుత్వం పరిధిని పెంచడంతో ఉద్యోగులను కూడా త్వరలోనే భర్తీచేసే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఇంకా డైరెక్టర్లను నియమించని ప్రభుత్వం

నుడా పరిధిని పెంచిన రాష్ట్ర ప్రభుత్వం ఛైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నేత కేశ వేణును నియమించింది. అయితే డైరెక్టర్లను ఇంకా నియమించలేదు. గతంలో 13మండలాలు నుడా పరిధిలో ఉండటం వల్ల 13 మందికి అవకాశం కల్పించారు. ఈ దఫా జిల్లాలోని 33 మండలాల్లోని గ్రామాలను నుడా పరిధిలోకి తీసుకురావడం వల్ల సంఖ్యను పెంచాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. నుడాలో అన్ని మండలాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని నేతలను కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికీ డైరెక్టర్లను నియమించకపోవడంతో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవులు పూర్తయినందున ఈ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీకి వెన్నంటి ఉండి గ్రామ, మండల స్థాయిలో పేరుపొందిన సీనియర్ నేతలు నుడాలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రాబోయే రోజుల్లో అన్ని మండలాల పరిధిలో నుడా ద్వారానే నిర్మాణాలతోపాటు అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వనుండటంతో తమకు కలిసి (మిగతా 6వ పేజీలో..)

బోధన్ కోర్టులో
చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు కోర్టులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి భారతీయ నాగరిక సురక్ష సంహిత-2023 గురించి వివరించారు. భారతీయ సాక్ష అధినీయం న్యాయ చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్ రావు, డాక్టర్ పల్నాటి సమ్మయ్య, సీఐ వెంకట నారాయణ, రుద్రూరు సీఐ కృష్ణ, రెంజల్ ఎస్సై సాయన్న, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి గంగాదాస్, బోధన్ ఎక్సైజ్ ఎస్ఐ ఎండీ జలీలుద్దీన్, బోధన్ కోర్టు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్లు, సంబంధిత అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు జవహర్ నవోదయ
పాఠశాల మంజూరు పట్ల హర్షం

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాకు మరో జవహర్ నవోదయ పాఠశాల మంజూరు కావడం పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. జవహర్ నవోదయ పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే నిజామాబాద్, బోధన్ పట్టణాల్లో కేంద్ర విద్యాలయం ఉన్నందున నూతనంగా మంజూరైన జవహర్ నవోదయ పాఠశాలను ఆర్మూర్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఇక్కడి ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు విజ్ఞప్తి చేశారు.

పిప్రి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాధికారి రాజ గంగారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈవో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు అనుసరిస్తున్న కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులు నిరంతరం శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను
పకడ్బందీగా నిర్వహించాలి

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత వార్డు అధికారులదేనన్నారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈలతో కౌన్సిలర్లు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

నవీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు. స్టేషన్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి


సుబ్రమణ్యా స్వామి కల్యాణం


మెండోరలో ఆరట్టులో స్వామిని దర్శించుకుంటున్న సునీల్‌కుమార్

బోధన్‌రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శనివారం వినాయక్ నగర్‌లో సుబ్రమణ్యా స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య సుబ్రమణ్యా స్వామి కల్యాణ వేడుకలను అయ్యప్ప స్వాములతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్గశిర మార్గశుద్ధ షష్ఠి తిథి సందర్భంగా సుబ్రమణ్యా స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించామని వేద పండితుడు ఉదయ్ మహరాజ్ తెలిపారు. శరవన భవ అంటూ అభిషేకాలు, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మహరాజ్ మాట్లాడుతూ శ్రీవల్లి దేవాసేన సుబ్రమణ్యా స్వామి కల్యాణానికి ప్రత్యేకత ఉందని ప్రత్యేకతను వివరించారు. కల్యాణాన్ని తిలకించిన వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలతో పాటు ఆర్థిక బాధలు తొలగి ప్రజల బాధలు తొలగి సకల దోషలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తులకు అపార నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ దంపతులు, రూరల్ సీఐ వెంకట నారాయణ, కౌన్సిలర్ దాము, భక్తులు, అయ్యప్ప స్వాములు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయ ప్రాంగణలోని అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి నిర్మల నగేష్‌శర్మ పురోహితులతో మహా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామికి అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామి జన్మదినం సందర్భంగా షష్ఠి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి అధ్యక్షుడు పెంట జలందర్, అఖిల భారత దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు నోముల నవీన్, గురుస్వాములు జనార్ధన్‌గౌడ్, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనుంజయ్, మాసాల సత్యనారాయణ, గోల్డ్ సురేష్, ఖాందేశ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెండోరలో అయ్యప్పస్వామి ఆరట్టు అభిషేకం

మెండోర: మండల కేంద్రంలో అయ్యప్ప దీక్ష స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆరట్టు అభిషేకం కార్యక్రమాన్ని అయ్యప్ప దీక్ష స్వాములు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరట్టులో పూలతో అలంకరించి వాహనంపై స్వామివారిని గ్రామ వీధుల గుండా ఊరేగించారు. మహిళల మంగళ హారతులతో అయ్యప్పస్వాముల నృత్యాలు, స్వామియే శరణమయ్యప్ప నామాలతో గ్రామ వీధులు మార్మోగాయి. కోనేరులో స్వామివారి అభిషేకం నిర్వహించారు. ఆరట్టులో స్వామివారిని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వే ల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సలీం, పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, గురు స్వాములు మోతె గంగారెడ్డి, సుమో రాజేశ్వర్, కొప్పెల మోహన్, నూత్‌పల్లి శ్రీనివాస్, కొత్తపల్లి రమేష్, వరిగడ్డి రవి, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్గిమల్లన్న స్వామి రథోత్సవం


మల్లన్నస్వామి రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో శనివారం మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్నస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు నందు యాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో శ్రీమల్లన్నస్వామి (కండె రాయుడు) కల్యాణోత్సవం వీడీసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈనెల 15న మల్లన్నస్వామి మొదటి జాతర, రథోత్సవం నిర్వహిస్తామని, ఈ నెల 22వ తేదీన రెండో రథోత్సవం నిర్వహించనున్నట్టు వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం తెలిపారు.

ఏర్గట్లలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఏర్గట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నేటికి సంవత్సరం పూర్తి కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు దొరల అహంకార ప్రభుతానికి స్వస్తి చెప్పి సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనతో, అనేక సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, గడ్డం జీవన్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి

రెంజల్: పేద ప్రజల పెన్నిధి, రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్ అన్నారు. శనివారం వివిధ గ్రామాలకు చెందిన 25మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న వారికి నేనున్ననంటూ భరోసా ఇచ్చే నాయకుడు సీఎం రేవంత్ అని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే సీఎం ధ్యేయమన్నారు. శనివారం సాటాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అన్నివర్గాల వారికి సమన్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయారెడ్డి, జావీదోద్దీన్, రాములు, ధనుంజయ్, రవి పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భారీ మెజారిటీతో గెలిచిన చరణ్‌గౌడ్‌ను శనివారం మోర్తాడ్ ప్రజానిలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఉపాధ్యక్షుడు వాక రమేష్, భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్
పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక

జక్రాన్‌పల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి) జాతీయస్థాయి వాలీబాల్ అండర్-14 విభాగంలో పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఎం.సాన్విక ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని ఎస్.సాన్విక పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎం.సాన్వికను ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ షురూ

నందిపేట, డిసెంబరు 7: మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే చేపట్టారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రకారం దరఖాస్తుల ఆధారంగా సర్వే షురూ చేశారు. దరఖాస్తు దారులకు ఇళ్ళు ఉందా లేదా, అర్హులా.. కాదా అనే అంశాలపై స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీనివాస్ రావు, మండల తహశీల్దార్ ఆనంద్ కుమార్ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా జరగాలని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు సెల్ పోన్ యాప్‌లో లబ్ధిదారుల పోటోలను తీసుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న విద్యార్థులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సైన్స్ సామాజిక శాస్త్రం, సాంఘికశాస్త్రం, జీవశాస్త్రంకు సంబంధించి ప్రదర్శనను నూతన విధానాన్ని పొందారు. ప్రధానోపాధ్యాయుడు లచ్చన్న, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధలతో విద్యార్థులకు వివిధ ప్రయోగాలను వివరించి వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సిద్ధాంతాలను అవగాహన కల్పించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అనేక ప్రశ్నాలపై స్పష్టత నిచ్చారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రొత్సాహాన్ని పొందారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల దుకాణదారులు తమ అద్దె బకాయిలను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. అలాగే పట్టణంలోని దుకాణదారులు, ఇంటి యాజమానులు తమ పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల మున్సిపల్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేశారు. దుకాణాల కాల పరిమితి ముగిసిపోయిన ఎవరు ఖాళీ చేయడం లేదన్నారు. కాంప్లెక్స్‌లోని 26షాపులను 25సంవత్సరాలకు లీజుకు ఇచ్చామన్నారు. 2024మార్చితో వీరి గడువు ముగిసిందన్నారు. అయిన దుకాణదారులు ఖాళీ చేయకపోవడంతో అధికారులు షాపులను సీజ్ చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

● జిల్లా విద్యాధికారి అశోక్


ఆర్మూర్‌లో జిల్లా క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి రాణించాలని జిల్లా విద్యాధికారి పి.అశోక్ అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడను ఎంచుకొని అందులో రాణించేందుకు సాధన చేయాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు సమిష్టి భావన, సమన్వయం పెంపొందుతాయన్నారు. ఆటలు ఆడిన ప్రతీ విద్యార్థికి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు దగ్గరవుతారని, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన ప్రతీ సారి గెలుపు కోసం ప్రయత్నిస్తే విజయం మీ సొంతమవుతుందన్నారు. అంతకు ముందు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం, హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, జిల్లా స్కూల్స్ గేమ్స్ కార్యదర్శి నాగమణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగామోహన్, పీఈటీల సంఘం ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్, సుప్పరి వినోద్, శ్యామ్‌సుందర్ శర్మ, శ్రీనివాస్, బాబురావు, రాజ్‌కుమార్, సుజాత, సంజీవ్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై మంత్రికి ఫిర్యాదు

మద్నూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గంలోని వైన్స్ యజమానులు బిచ్కుంద సీఐ సత్యనారాయణపై ఫిర్యాదు చేశారు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా విదులు నిర్వహిస్తున్న సత్యనారాయణ గత కొన్ని నెలలుగా వైన్స్ యజమానులకు ఇబ్బందులు పెడుతున్నారని, ఫిర్యాదులో పేర్కొన్నారు. పర్మిట్ రూమ్‌లు, వైన్స్‌లో పని చేస్తున్న పిల్లలపై కేసులు నమోదు చేస్తున్నారని ఫిర్యాదులు పేర్కొన్నట్లు తెలిపారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు అందజేశామని, గత నెల 30న సీఐ వేధింపులకు నిరసనగావైన్స్‌లను మూసివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 15మందికి గాయాలు

● భయాందోళనలో ప్రజలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 33, 34, 35, 36వార్డులలో కుక్కల దాడిలో 15మందికి గాయాలు కాగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ం రాత్రి పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో కుక్కలు చిన్న పెద్ద తేడా లేకుండా రోడ్డు వెంట వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపర్చాయి. దీంతో గాయపడ్డ వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

● ఒంటరిగా బయటకు వెళ్లాలేని పరిస్థితి

అత్యవసర పరిస్థితుల్లో సైతం ఒంటరిగా బయటకు వెళ్లాలేని పరిస్థితి మున్సిపల్ పరిధిలో నెలకొంది. ప్రతీ వార్డుల్లో రోడ్డు పైన కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళ్తే దాడులకు పాల్పడుతున్నాయి. శుక్రవారం రాత్రి ఓ మహిళ తన కుమారుడు, కూతురి వెంట తీసుకొని గోల్‌బంగ్లా వైపు వెళ్తుండగా వెనుక నుంచి ఓ కుక్క తన కుమారుడిని కాలుని కారవడంతో ఆమె కేకలు వేయగా పలువురు ఆ కుక్కను తరిమివేశారు. అలాగే హుస్నాబాద్ గల్లీలో ప్రజ్ఞ హైస్కూల్ మూల వద్ద ఓ మహిళ తన కూతురి ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేసింది. అలాగే దయానంద్‌నగర్‌లో ఓ చిన్నారి తన అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేయంతో చేతికి గాయాలయ్యాయి.కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

● ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నాం:రాజు, మున్సిపల్ కమిషనర్

గత పాలకవర్గ సమావేశంలో కుక్కల బెడద తగ్గడానికి రూ.10లక్షల బడ్జెట్‌ను కేటాయించాం. సెప్టెంబర్ నెలలో సుమారు 52కుక్కలను జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేద విద్యార్థులకు వరం

● మంత్రి జూపల్లి కృష్ణారావు


కాలి నడకన కోటకు చేరుకుంటున్న మంత్రి జూపల్లి

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 07 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతో కలిసి సందర్శించారు. జుక్కల్ పర్యటనలో భాగంగా కౌలాస్ కోటకు చేరుకున్న మంత్రికి జుక్కల్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి మంత్రి జూపల్లి ఎమ్మెల్యే తోట, వివిధ శాఖల అధికారులతో కలిసి కోటపైకి కాలినడకన చేరుకున్నారు. కోటపైకి చేరుకున్న మంత్రికి ఎమ్మెల్యే తోట కోట విశిష్టతను వివరించారు. ఈ కోట 12 శతాబ్దంలో కాకతీయులు నిర్మించారని ఆనాటి నుంచి కోటకు మరమ్మత్తులు లేక శిథిలావస్థకు చేరుకుందని మంత్రికి వివరించారు. అంతేగాక ఈ కోట మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు దగ్గరగా ఉన్నందున ప్రతి నిత్యం ఆయా రాష్ట్రాల నుండి పర్యాటకులు వస్తుంటారని మంత్రికి వివరించారు. కోటలో అద్భుతమైన కళాఖండాలు ఉన్నందున కోటను అభివృద్ధి చేస్తే రానున్న తరాలకు వారసత్వంగా ఈ కోటను అందించేవారమవుతామని ఎమ్మెల్యే మంత్రికి సూచించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో పురాతన కట్టడాలను సంరక్షించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. కోటలో అపూర్వమైన కళాఖండాలు ఉన్నందున వాటిని రక్షిస్తామని తెలిపారు. దీంతో పాటుగానే కోట అభివృద్ధికి రానున్న రోజుల్లో అన్ని రకాల చర్యలు తీసుకుని ముందుకు వెల్తామని తెలిపారు, కోటను త్వరలో అభివృద్ధి చేసి పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి తనకు నివేదికలు పంపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిఎస్‌పీ నిఖిత, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మండల తహసీల్దార్ హిమబిందు, వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్ మండల కేంద్రంలో రూ.305 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌లు శంకుస్థాపన చేశారు. అనంతరం మద్నూర్‌మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ సౌజన్య ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేఆరు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహంలో రాచరిక అనవాళ్ళు లేకుండా తెలంగాణ దృశ్యాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షల స్పూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ళు గడిచినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్ళ విధ్వంసానికి గురైందని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని, దీంతో దశాబ్ద కాలపు నిరంకుశ, దోపిడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఆశీస్సులతో రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యావత్ తెలంగాణ ప్రజలు అలుపెరుగని పోరాటాలతో డిసెంబర్ 7, 2023న తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువు దీరిందని పేర్కొన్నారు. అమరుల ఆశయ సాధనకు ఇందిరమ్మ అడుగు జాడల్లో నడుస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీయే శ్రీరామ రక్షాగా ఉంటుందని పేర్కొన్నారు. కుల మతాల మధ్య వైషమ్యాలు తొలగించడం మా విధానమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలు అన్నింటినీ కలిపే ఒకే చోట సమీకృత సముదాయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు మంజూరు ఇవ్వడం జరిగిందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలనుఅమలు చేస్తుందని ఆరు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం ఇస్తున్నామని, త్వరలో నే పంటల భీమా పథకం అమలు చేస్తామని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అవాస్తవాలను, వాస్తవాలను చిత్రకరించే ప్రయత్నం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై అసెంబ్లీ సాక్షిగా చర్చించేందుకు మేము సిద్దంగా ఉన్నామని, అప్పులపై చర్చకు మీరు సిద్దమా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి ఇవాళ్ళ గొప్ప పాలన చేశామని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలోనే తెలంగాణలో అతిపెద్ద రుణమాఫీ


మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): భారతదేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రుణమాఫీ జరిగిందని, ఇప్పటికే 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ జరిగిందని, త్వరలో రూ.2లక్షలకు పైగా రుణాలు కలిగిన రైతులకు రుణామాఫీ అవుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మోర్తాడ్ మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ వరి వేస్తే ఉరి అనుకునే రోజుల నుంచి వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందని, ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 ఉచిత గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా అందించామని, దీని వల్ల ప్రతీ కుటుంబానికి రూ.10వేలు ఆదా అవుతుందని ఆయన అన్నారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గురుకులల ఏర్పాటు ద్వారా విద్య వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. స్వయం సహాయ సంఘాలకు, పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తున్నామన్నారు. అవినీతి ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీ జాతీయ సంస్థకు అప్పగించడం అవినీతికి దూరంగా ఉంచామని తెలిపారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించామని, రాష్ట్రంలో 4లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, నియోజకవర్గానికి 3500 నుంచి 4500వరకు సీఎం రేవంత్‌రెడ్డి మంవజూరు చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో కుటుంబ పాలన నడిచిందని, పదేళ్ళలో వారి కుటుంబం మాత్రమే బాగుపడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలకు సంక్షేమం కల్పించడంతో లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు.

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో నియోజకవర్గ ప్రజలకు బాధ్యతతో సేవలందిస్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో గంజాయి, రౌడీయిజం, గుండాయిజం లేకుండా చేశానని సునీల్‌కుమార్ అన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీలు కల్లెడ చిన్నయ్య, గిర్మాజీ గంగాధర్‌లు జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ముత్యాల రాములు, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంజీవరెడ్డి, నవీద్, పాటు మహిళలు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో పొలం విషయంలో ఘర్షణ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం పొలం విషయంలో ఒకే వంశానికి చెందిన వారు శనివారం ఘర్షణ పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామ శివారులో ఉన్న ఎస్సారెస్పీకి చెందిన భూమిని సాగు చేసుకుంటున్నారని, భూమి విషయంలో గతంలో నుండి వీరి మధ్యన గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం సైతం పొలం వద్ద కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్ కుటుంబాల వారు కర్రలతో దాడులు చేసుకోగా కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్‌లకు తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స నిమిత్తం బాధితులను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. ఈ విషయంలో ఇరుపక్షాలకు చెందిన ఫిర్యాదు మేరకు కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్‌లతో పాటు మరో 9మందిపై కేసు నమోదు అయిందని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

ముప్కాల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో మంజూరైన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శనివారం స్థల పరిశీలన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ పరిశీలించారు. గత సంవత్సరం ముప్కాల్ మండల కేంద్రానికి ప్రభుత్వం స్థలం మంజూరైనప్పటికీ అనువైన స్థలాన్ని పరిశీలించారు. పోచంపాడ్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాకేష్, క్లస్టర్ ఇన్‌చార్జీ, తదితరులు పాల్గొన్నారు.

భక్తి



ఏర్గట్లలో అయ్యప్ప అభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఏర్గట్లలో వైభవంగా

అయ్యప్ప ఆరట్టు పల్లకీ సేవ

ఏర్గట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సొడాల వినోద్ గురుస్వామి, అర్చకులు రాకేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప ఆరట్టు, పల్లకీ సేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి పల్లకీ సేవను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నప్రసాదం నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు





నిజాంసాగర్ పోలీసు స్టేషన్ భవనం

ఆంధ్రజ్యోతి ఫోకస్

శిథిలావస్థకు చేరిన..

నిజాంసాగర్ పోలీసుస్టేషన్ భవనం

- ఏ క్షణం కూలుతుందోనన్న భయాందోళనలో పోలీసులు
- నాణ్యత లేక.. అధ్వాన్న స్థితికి చేరిన భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ పోలీసుస్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ పాలకులు, అధికార యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2007లో నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. ఈ భవన సముదాయాన్ని లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పట్లో నిర్మాణం చేపట్టినప్పటికీ.. భవన సముదాయాన్ని పిల్లర్లతో నిర్మాణం చేపట్టలేకపోయారు. కేవలం సిమెంట్ ఇటుకలతోనే పోలీస్‌స్టేషన్ భవన సముదాయాన్ని రెండంతస్తుల్లో నిర్మాణం చేపట్టారు. దశాబ్దాల తరబడి ఉండాల్సిన పోలీస్ స్టేషన్ భవన సముదాయం 18ఏళ్లకే బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఊడాయి. అలాగే భవన రేయిలింగ్ శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడం పట్ల పోలీసులు ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో గోడలు నీటికి తడిసిముద్దవుతున్నాయి. ఫలితంగా పోలీస్‌స్టేషన్ భవనం లోన లొటారం, పైన పటారం అన్న చందంగా మారింది. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టిన పోలీసు స్టేషన్.. బాత్‌రూమ్‌లతో పాటు ఫ్లోరింగ్ కుంగిపోయి అధ్వాన స్థితికి చేరింది. ప్రభుత్వాలు, పాలకులు మారినా.. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉన్న పోలీసుస్టేషన్ భవనం దుస్థితి మాత్రం మారడం లేదు. కనీసం ఇప్పటికైనా పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి.. నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ భవన సముదాయంతో పాటు పోలీసు క్వార్టర్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోలీసు స్టేషన్‌లో ఫ్లోరింగ్‌కు పగుళ్లు ఏర్పడిన దృశ్యం



పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో కూలిన రేయిలింగ్



అధ్వానంగా మారిన పోలీసు స్టేషన్‌లోని బాత్‌రూమ్‌లు

నిర్మించారు.. వదిలేశారు!



ఎత్తొండలో వృథాగా మారిన ఆరోగ్య ఉప కేంద్రం

ఆంధ్రజ్యోతి పరిశీలన



కొత్తపల్లిలో ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉప కేంద్రం

- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానాలు
- కరెంట్ కనెక్షన్, తాగునీటి వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

కోటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసినా.. వాటికి భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. దీంతో చికిత్సకు వచ్చిన ప్రజలు ఆరోగ్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల భవన నిర్మాణాలు చేపట్టినా కనీస వసతులు కల్పించకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. మరికొన్ని చోట్ల స్థలాలు లేకపోవడంతో భవనాల నిర్మాణ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నిర్మించిన పల్లె దవాఖానాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో వృథాగా మారుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినాకరెంట్ కనెక్షన్, తాగునీటి వసతి వంటి వసతులు కల్పించకపోవడంతో అధికారులు దాట వేసే ధోరణి అవలంభిస్తున్నారు. దీంతో గత ఏడాదిన్నరగా భవనాలు ప్రారంభానికి నోచుకోకగా పోగా.. మరికొన్ని ప్రారంభించిన వసతులు కల్పించకపోవడంతో వృథాగా మారాయి. కోటగిరి ఉమ్మడి మండలంలో 11సబ్ సెంటర్లు ఉన్నాయి. కల్లూర్, సుంకిని, సులేమాన్ నగర్ గ్రామాలలో మాత్రమే సబ్ సెంటర్ల భవనాలు ఉండేవి. గత మూడేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వ హయాంలో కోటగిరి మండలానికి నాలుగు సబ్ సెంటర్లు మంజూరయ్యాయి. కోటగిరి మండలంలోని ఎత్తొండ, కొత్తపల్లి, పొతంగల్ మండలంలోని దోమలెడ్గి గ్రామాలో సబ్ సెంటర్ల నిర్మాణం పూర్తయింది. ఒక్కో భవనానికి 16 లక్షల రూపాయల చొప్పున నిధులు వెచ్చించారు. ఎత్తొండ భవనం పూర్తి అయి ప్రారంభించినా.. ఫలితం లేకుండా పోయింది. సబ్ సెంటర్‌లో కరెంట్, తాగునీటి వసతి లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. సబ్ సెంటర్‌కు వేసిన తాళం వేసినట్టుగానే ఉండిపోయింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలో సేవలు అందిస్తున్నారు. దోమలెడ్గిలోనూ భవనం పూర్తయినా వసతులు లేకుండా పోయాయి. గ్రామ పంచాయతీ నుంచి విద్యుత్ సరఫరాను తీసుకుని సెంటర్‌ను వినియోగిస్తున్నారు. ఇక్కడ నీటి వసతి కల్పించ లేదు. కొత్తపల్లి గ్రామంలోనూ భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణం సైతం ఇష్టారాజ్యంగా చేపట్టి మమ అనిపించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనంలో విద్యుత్, ఇతరత్రా వసతులు కల్పించకపోవడం గమనార్హం. నేటికీ సబ్ సెంటర్ల నిర్వహణ అధ్వానంగా కొనసాగుతోంది. కోటగిరి మండల కేంద్రంలోనూ ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మించకపోవడంతో అద్దె భవనం, పంచాయతీ భవనాలలో సేవలు అందిస్తున్నారు. పొతంగల్ మండల కేంద్రంలోనూ ఆరోగ్య ఉప కేంద్రం ప్రైవేటు భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు నిర్మించిన వాటిని సైతం నియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- అలీమొద్దీన్, వైద్యాధికారి, పొతంగల్



ఆరోగ్య ఉప కేంద్రాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిర్మించిన వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

క్రీడా సమాచారం!!



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కోనాసముందర్ ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు

కోనాసముందర్ విద్యార్థుల ఎంపిక

కమ్మర్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాసముందర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అండర్- 14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం బి.మధుపాల్ పీఈటీ బి.రమేష్ గౌడ్ తెలిపారు. తిర్మన్‌పల్లిలో జరిగిన టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభను కనబర్చిన పాఠశాలకు చెందిన గనాపురం రాజవర్ధిని, కె.నిక్షిత్ కుమార్‌లు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 9,10,11 తేదీలలో కరీంనగర్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నస్రీన్‌బేగం, సభ్యులు, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్.. పట్టించుకోని అధికారులు



సిరికొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి నాలుగు రోజులైనా.. ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదు. ప్రస్తుతం నాట్లు వేస్తున్న తరుణంలో ట్రా న్స్‌ఫార్మర్ పాడైపోవడంతో మోటార్లు నడవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినప్పటికీ.. స్పందించడం లేదని గ్రామ రైతులు మిట్టపల్లి గంగారెడ్డి, విజయ్, ప్రసాద్, లాజర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

మొరాయించిన రైల్వే గేటు



ఇస్లాంపూర్ రైల్వే గేటు మొరాయించిన దృశ్యం

డిచ్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇస్లాంపుర రైల్వే గేటు గంట పాటు మొరాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. శనివారం మధ్యాహ్నం ముంబాయి నుంచి గూడూరు వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ కోసం రైల్వే గేటు వేస్తుండగా.. ఎలక్ట్రానిక్ గేటు మొరాయించింది. దీంతో తాత్కాలిక గేటు ద్వారా రైల్వే సిబ్బంది వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోవడంతో.. వాహన చోదకులు రైల్వే గేటు సిబ్బందిపై మండి పడ్డారు. రైలు రాకముందు సుమారు గంట పాటు ఎందుకు గేటు వేశారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. రైల్వే సిబ్బంది ఇటీవల ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ సిగ్నల్ పనిచేయక పోవడంతో తరచూ ఇలాంటి సమస్యలు ఎదు రవుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

- డిచ్‌పల్లిలో గంట పాటు నిలిచిన ట్రాఫిక్



గంట తర్వాత వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్

ఫోటో న్యూస్



పనిచేయని ఎలక్ట్రానిక్ గేటు



గేటు వేయడంతో నిలిచిన ట్రాఫిక్



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న న్యాయాధికారి

లంచం ఇవ్వడమూ నేరమే

- అవినీతి నిరోధక శాఖ ముగింపు వారోత్సవాల్లో జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్‌లీగల్/ఖిల్లా, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకోవడం ఎంత నేరమో తీసుకోవడమూ నేరమేనని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల ముగింపులో జిల్లాన్యాయాధికారి సునీత కుంచాల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతిని శాశ్వతంగా నిర్మూలించాలంటే ముఖ్యంగా ప్రతీఒక్కరి తోడ్పాటు ఎంతోముఖ్యమన్నారు. ఏసీబీ కేసుల్లో ఫిర్యాదుదారులు కేసుల చిట్టచివరి వరకు నిలబడి నిందితులకు శిక్షపడేలా చేసుకోవడం చాలా ఓర్పుతో కూడుకున్న పని అని చెప్పారు. ఏసీబీ కేసులో చివరివరకు నిలబడి శిక్షపడేలా చేసిన ఇద్దరు ఫిర్యాదుదారులకు జిల్లా జడ్జి, డీఎస్పీ శేఖర్‌గౌడ్‌లు సన్మానించారు. అనంతరం అవినీతి నిరోధకం గురించి వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఏసీబీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫిర్యాదుదారుడికి సన్మానం

అవినీతి నిరోధకశాఖ ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి శిక్ష పడేందుకు ఉత్తమ ఫిర్యాదుచేసిన వ్యక్తులకు జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల సన్మానించారు. సన్మాన కార్యక్రమం, వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

విద్యార్థినులకు రెండు జతల షూల అందజేత



పాఠశాలలో విద్యార్థికి షూ, సాక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి,డిసెంబరు7: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న బాలికల ప్రాథమిక పాఠశాలకు చెందిన 60మంది విద్యార్థినిలకు గ్రామానికి చెందిన సామ బాలకిషన్ (కపిల్) తన సొంత ఖర్చులతో ప్రతీ విద్యార్థికి 2 జతల షూ, సాక్స్ అందజేయగా వాటిని ఎంఈవో ఆంధ్రయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎం ఎస్ వోకనక గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, సభ్యులు బుచ్చిమల్లయ్య, నిమ్మ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సుద్దలం విద్యార్థి

డిచ్‌పల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని రిసికరెడ్డి ఎస్‌జీఎఫ్ అండర్ -17 రాష్ట్రస్థాయిపోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి నెట్‌బాల్ పోటీలకు జాతీయస్థాయికి ఎంపికైందని పీఈటీ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో నిసికరెడ్డి ప్రతిభ కనబర్చిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగారం, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ అంకిత్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పరిశీలించి వాస్తవం పరిస్థితులను సర్వేలో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శనివారం సాయంత్రం డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ పంచాయతీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.సర్వేను నామమాత్రంగా చేస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని అన్నారు.

మహిళ అదృశ్యం

మోపాల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్ ఫేస్-1కు చెందిన గట్లవిజయ (57) అదృశ్యమైనట్లు భర్త లింబాద్రి శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విజయకు గత కొన్నిరోజుల నుంచి మతిస్థిమితం సరిగాలేదని ఆమె ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసినవారు రూరల్ పోలీస్‌స్టేషన్ 8712659849 ఎస్సై, 87126659847 సీఐలకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై ఆరిఫ్ కోరారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ఎస్ఎస్ఆర్ డిస్కవరీ విద్యార్థులు

ముగిసిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. గతరెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు వేలాదిమంది విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు అంతా శాస్త్రవేత్తల సూచనల మేరకే ఉంటుందని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలనే అవసరం ఉందన్నారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేసి తనచుట్టూ ఉన్నటువంటి వనరులను సంరక్షించుకునే బాధ్యతను తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించబోయే ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రస్థాయికి ఇన్‌స్పైర్‌లో 13 ప్రాజెక్టులు ఎంపిక చేయగా సైన్స్ ఎగ్జిబిషన్‌లో జూనియర్ స్థాయిలో 7, సీనియర్ స్థాయిలో 7 ప్రాజెక్టులు మొత్తం 14ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, సురేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన కాకతీయ ప్రాజెక్టు

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీమాన్య, బామినిలు రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. గ్యాస్ లీకేజీ డిటెక్షన్ సిస్టమ్, ఎయిర్ పొల్యూషన్ మానిటరింగ్, ఎర్త్‌కేట్ డిటెక్షన్ సిస్టమ్, ఫ్లడ్ అలర్టింగ్ సిస్టమ్‌తో రూపొందించిన ప్రాజెక్టు ఆకట్టుకుంది. వరదలు వచ్చినప్పుడు, భూకంపాలు వచ్చినప్పుడు ప్రజలను అలర్ట్ చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్లు తేజస్విని, రాజా రామోజీరావులు అభినందించారు.

ఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు..

నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సుప్రియ హీరామ్, కవాశీష్ శర్మలు రూపొందించిన ఎర్త్‌కేట్ అలారం వర్కింగ్ మోడల్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్ ఫ్యూచర్ అనే థీమ్‌లో రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ మారయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

పదేళ్లలో చేయని అభివృద్ధి ఏడాదిలో చేశాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ధర్పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేయని అభివృద్ధి పనులను కేవలం ఏడాదిలోనే చేసి చూపించామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో జరిగిన సామూహిక అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేయలేని అభివృద్ధి పనులను కేవలం ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. గడీల పాలనను బద్దలు కొట్టి ప్రజాపాలనను తీసుకొచ్చామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేశామన్నారు. 2లక్షల రుణ మాఫీ రైతులకు చేసి చూపించామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నెలకు రూ.350కోట్ల నష్టం వచ్చినప్పటికీ ప్రభుత్వం దాన్ని భరించి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇచ్చి నిరుపేదలకు అండగా నిలిచామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల శ్రీనివాస్, మిట్టపల్లి ప్రవీణ్‌రెడ్డి, ఆర్మూర్ రంజిత్, వెంకటరెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి: ఐఎఫ్‌టీయూ

డిచ్‌పల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ అన్నారు. శనివారం పంచాయతీ వద్ద ఐఎఫ్‌టీయూ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి ఏడాది గడిచినా ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. పర్మినెంట్ కానీ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జెండాఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉద్దేశించిన సహాయనిధికి కలెక్టర్ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి గౌరవవందనం సమర్పించారు. అదనపు కలెక్టర్ అంకిత్‌తో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ రేయింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు. సైనికుల త్యాగాలను ప్రతీ పౌరుడు గుర్తిస్తూ వారిపట్ల, వారిసేవలపట్ల గౌరవ భావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రమేష్, కార్యాలయ సిబ్బంది, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

- శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

నిజామాబాద్‌కల్చరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాస సుబ్రహ్మణ్య స్వామి జన్మదినం అయిన షష్ఠిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో ఆలయాల్లో కొలువుదీరిన సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పలు ఆలయాల్లో షష్ఠిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్య స్వామికి డోలారోహణం నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి జోడు నాగదేవతల రూపంగా భావిస్తారు. దీంతో సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలతోపాటు పలు ప్రాంతాల్లో జోడు నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామికి వేదోక్తంగా అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. గాజుల్‌పేట్‌లోని హనుమాన్ దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి అర్చకులు ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. శంభులింగేశ్వర ఆలయం, మాధవనగర్ సాయిబాబా దేవాలయం, నీలకంఠేశ్వర ఆలయం, శిరిడీ సాయికృపనగర్ కాలనీలోని దత్తాదేయస్వామి ఆలయాల్లో సుబ్రహ్మణ్యషష్ఠి పూజలు ఘనంగా సాగాయి.

వైభవంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

బోర్గాం గ్రామంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. షష్ఠిని పురస్కరించు కొని ప్రతీయేటా స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ పరంపరను కొనసాగిస్తూ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని ఉత్సవ విగ్రహాలనుఉంచి కల్యాణ వేడుకను నిర్వహించారు. పండితులు అన్నప్రసాదంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌టీఐ రూరల్ అధ్యక్షుడిగా వంశీ నియామకం

డిచ్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సమాచార హక్కు రక్షణ చట్టం ఆర్‌టీఐ అధ్యక్షుడిగా కొండూర్ గ్రామానికి చెందిన తొర్లికొండ వంశీ శనివారం నియామకమయ్యారు ఆర్‌టీఐ జిల్లా జాయింట్ సెక్రటరి చౌకి వెంకటేశ్ ఆయనకు డిచ్‌పల్లిలో నియామక పత్రం అందజేశారు ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ సమాచార హక్కు రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండే విధంగా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

రామర్తి గోపిని అభినందించిన సీఎం



గోపిని అభినందిస్తున్న సీఎం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులతో ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనను అభినందించారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రంలో అత్యధికంగా సభ్యత్వం చేయించడంలో గోపి ప్రత్యేక పాత్రను పోషించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీచేసిన శివచరణ్‌రెడ్డి గెలుపులోనూ గోపి కీలకపాత్ర పోషించగా సీఎం అభినందించారు.

కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వద్దు: పీడీ

సిరికొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహించొద్దని డీఆర్‌డీవో పీడీ సాయగౌడ్ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లను ఆదేశించారు. సిరికొండలో శనివారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రజావేదికలో సాయగౌడ్ మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేనిసమయంలో కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లదేనని సూచించారు. కార్యక్రమంలో ఎండీవో మనోహర్‌రెడ్డి, పీఆర్‌డీఈ అహ్మద్ హుస్సేన్, ఏపీవో చంద్రశేఖర్ , టీఏలు పాల్గొన్నారు.

ఐటీఐ నిర్మాణానికి స్థల పరిశీలన

సిరికొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సిరికొండకు మంజూరైన ఐటీఐ భవన నిర్మాణానికి నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ శనివారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించారు. పెద్దవాల్గోట్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలో, చిన్నావాల్గోట్ వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ రవీందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీఎంకప్ క్రీడలు ప్రారంభం

సిరికొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ గ్రామస్థాయి క్రీడలు శనివారం అన్ని గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. శనివారం సిరికొండలో క్రీడలను తహసీల్దార్ రవీందర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

గల్ఫ్‌లో విగతజీవులవుతున్న జిల్లా వాసులు

(3వ పేజీ తరువాయి)

పైగానే ఈ సంవత్సరం మృతదేహాలు ఉంటాయని గల్ఫ్‌లో ఉంటున్నవారు చెబుతున్నారు.

మృతదేహం కోసం ఎదురుచూపులు

ఇటీవల మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ జమాల్ అలియాస్ మన్సూర్ సౌదీలో గుండెపోటుతో మరణించాడు. 15రోజులుగా కుటుంబ సభ్యులు మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు. రాత్రి పడుకున్న సమయంలోనే నిద్రలోనే గుండెపోటుతో మరణించాడని అక్కడివారు తెలిపారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సౌదీకి సంబంధించిన చట్టాల ప్రక్రియను పూర్తిచేసి వచ్చేవరకు మృతదేహానికి 15రోజులు అవుతుంది. ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. జమాల్‌కు సంబంధించిన బంధువులు సైతం సౌదీలోనే ఉండడంతో దగ్గర ఉండి వారు ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. అయినా మృతదేహం రావడానికి 15 రోజులవుతుంది. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. జమాల్‌కు భార్య, కొడుకు, కూతురున్నారు. 15 రోజులుగా మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు.

మృతిచెంది 15రోజులైనా స్వదేశానికి రాని మృతదేహం

నిజామాబాద్ రూరల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్ గత పదిహేనేళ్లుగా బెహ్రాన్ దేశంలో ఉపాధి నిమిత్తం వెల్డింగ్ పనిచేస్తున్నాడు. 5నెలల క్రితం బాల్‌రాజ్‌కు వెల్డింగ్ చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో మృతిచెందాడు. మృతిచెందిన 4రోజుల తర్వాత కుటుంబ సభ్యులకు బాల్‌రాజ్ చనిపోయాడని ఫోన్‌ద్వారా సమాచారం తెలిసింది. అనంతరం మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించే ప్రక్రియను ప్రారంభించగా పదిహేను రోజుల తర్వాత బాల్‌రాజ్ మృతదేహం స్వగ్రామానికి చేరింది. 15 రోజులపాటు కుటుంబ సభ్యులు కంటికి నిదుర లేని రాత్రులు గడిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్వయంగా కలగజేసుకుని మృతదేహాన్ని రప్పించేందుకు ప్రయత్నం చేశారు. దీంతో పదిహేను రోజుల్లో మృతదేహం స్వగృహానికి చేరుకుంది.

నుడా డైరెక్టర్ పదవులపై కాంగ్రెస్ సీనియర్ నేతల గురి

(3వ పేజీ తరువాయి)

వస్తుందని భావిస్తున్నారు. గ్రామాల్లో పరపతి పెరగడంతో పాటు తగిన అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఎలాగైనా ఈ డైరెక్టర్ పదవులను చేజిక్కించుకునేందుకు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు పార్టీకి చెందిన నియోజకవర్గ ఇంచార్జిలను కలుస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. నామినేటెడ్ పదవులు అన్ని అయిపోవడం, స్థానిక సంస్థల్లో అవకాశం వస్తుందో రాదో అని భావిస్తున్న నేతలు ఈ పదవులపై కన్నువేసి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఎలాగైనా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నుడా పరిధి పెరగడం వల్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా డైరెక్టర్ల పదవులు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అధికారులతో పాటు ఇతర నేతల దృష్టికి తీసుకువెళ్లి పెంచే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నుడా పరిధి పెరిగిన విధంగానే డైరెక్టర్ల సంఖ్య పెంచిన తర్వాత ఈ పదవులను భర్తీ చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు తెలిపారు. మొత్తంగా నుడా రేసులో మాత్రం మండలస్థాయి నేతలు పోటీ పడుతూ ఉండటంతో ప్రజాప్రతినిధులు త్వరగా భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సంఖ్య పెరిగితే సీనియర్ నేతలకు అన్ని మండలాల నుంచి అవకాశం రానుంది.

మరోచోటికి ఎన్టీఆర్ విగ్రహం!

డిచ్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ధర్మారం గ్రామంలో మరోచోటికి మార్పు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా గ్రామ పంచాయతీ పక్కన విగ్రహ ఏర్పాటుకు గద్దె నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారు. మరోవారం రోజుల్లో మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈవిగ్రహం ఆవిష్కరించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఎలమంచలి ఈశ్వరరావు ఈ విగ్రహం ఏర్పాటు చేయించారు. గతంలో ఏర్పాటుచేసిన ఈ విగ్రహంతో రోడ్డు పక్కనే ఉండటం, ఇరుకుగా మారడంతో మరో ప్రదేశానికి మార్పు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మోపాల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బోర్గాం(పి) గ్రామానికి చెందిన నడ్పి గంగారాంను శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పరామర్శించారు. శుక్రవారం రాత్రి ప్రమాదవ శాత్తుగా గంగారాం ఇళ్లు తగలపబడిపోయింది. ఇందుకు సంబంధించిన కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భూంరెడ్డి, సుభాష్, సాయిలు, హన్మాండ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.165	రూ. 185
వెన్‌కాబ్(కిలో)	రూ.110	రూ.170	రూ. 190

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78,800	రూ.72,700	రూ.950

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.15, 2.20, 6.25, 10.30)

స్క్రీన్-2 : పుష్ప-2 (9.30, 1.35, 5.40, 9.45)

స్క్రీన్-3 : పుష్ప-2 (10.00, 2.05, 6.10, 10.15)


స్క్రీన్-4 : పుష్ప-2 (9.45, 1.50, 5.55, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : పుష్ప-2 (10.15, 2.00, 6.00, 10.00)

స్క్రీన్-2 : పుష్ప-2 (1.00, 4.45, 9.10)

స్క్రీన్-3 : పుష్ప-2 (11.00, 3.10, 7.00, 10.45)



దేవి : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)

నటరాజ్ : పుష్ప-2 (హిందీ) (10.00, 2.00, 6.00, 10.00)

విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)

లలితామహాల్ : కేశవ చంద్ర రమావత్ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్